
కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -206 తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ 07-08-2026 శుక్రవారం పేజీలు : 4

# స్మార్ట్ కార్డుల శంఖారావం




- ఆగష్టు 15 నుంచి స్మార్ట్ కార్డుల జారీ
- 1.05 కోట్ల మందికి భారీ లబ్ధి
- సంగారెడ్డిలో సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- 119 నియోజకవర్గాల్లో ఏకకాల పంపిణీ
- పీవీసీ కార్డులతో ఆధునిక భద్రత
- క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ గుర్తింపు
- ఈ-కేవైసీ పూర్తి.. పంపిణీకి సిద్ధం
- సంక్షేమ పాలనలో మరో కీలక అడుగు

**న్యూస్ డెస్క్, 06 ఆగష్టు (బిఎన్ఎస్):** తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది కుటుంబాలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వంశుభవార్త చెప్పింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్ట్ 15వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా కొత్త తెల్ల రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సంగారెడ్డి జిల్లాలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనుండగా.. అదే రోజు రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకేసారి స్మార్ట్ కార్డుల పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు.

మిగతాది 2 లో..

# బట్టకాల్చి మీదేస్తే ఊరుకునేది లేదు

- కాంగ్రెస్‌కు హరీశ్ వార్నింగ్
- క్షుద్రపూజల ఆరోపణలపై ఫైర్
- పరువు నష్టం కేసులు
- 30 రోజుల గడువు
- డైవర్షన్ పాలిటిక్స్ ఆరోపణ
- ప్రభుత్వ వైఫల్యాల ప్రస్తావన


2 లో

**న్యూస్ డెస్క్, 06 ఆగష్టు (బిఎన్ఎస్):** తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు పడకుండా క్షుద్రపూజలు చేస్తున్నారంటూ కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ముఖ్యనేత, మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు.

# ఎల్‌నినో మరింత ఉధృతం


2 లో

- ఆగస్టు, సెప్టెంబర్‌లో ఎల్‌నినో మరింత ఉధృతం
- తక్కువ వర్షాలతో తేమ కొరత హెచ్చరిక
- ఐరోపాను దహిస్తున్న వడగాలులు, కార్చిచ్చులు
- అమెరికాలోనూ రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు

# గోబర్ధన్‌కు కేబినెట్ ఆమోదం

- రూ.23,731 కోట్ల పథకం
- స్వచ్ఛ ఇంధనానికి ఊతం
- రైతులకు కొత్త అవకాశం
- అస్సాం కారిడార్‌కు గ్రీన్ సిగ్నల్
- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు



**న్యూస్ డెస్క్, 06 ఆగష్టు (బిఎన్ఎస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు, పథకాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. భారతదేశ స్వచ్ఛ ఇంధన ప్రయాణంలో కీలక మైలురాయిగా నిలిచే 'గోబర్ధన్' (నేషనల్ సర్క్యులర్ బయోఎనర్జీ స్కీమ్) పథకానికి ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం రూ.23,731 కోట్ల అంచనా వ్యయంతో రూపకల్పన చేసిన ఈ పథకం, 2026-27 ఆర్థిక సంవత్సరం నుండి 2035-36 ఆర్థిక సంవత్సరం వరకు పదేళ్ల పాటు అమలు కానుంది. దేశంలో సమృద్ధిగా లభించే వ్యవసాయ వ్యర్థాలు, పశువుల పేడ, ప్రెస్ ముద్, పురపాలక సేంద్రీయ వ్యర్థాలను పరిశుభ్రమైన ఇంధనంగా, సేంద్రీయ ఎరువులుగా మార్చడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. భారత భవిష్యత్ ఇంధన అవసరాల్లో కంప్రెస్డ్ బయో గ్యాస్ ను ..

2 లో

# అస్సాంలో వరద బీభత్సం


2 లో

- అస్సాంలో వరదలతో 95 మంది మృతి
- 25 జిల్లాల్లో వరదల తీవ్ర ప్రభావం
- 1.22 లక్షల మంది తీవ్ర ఇబ్బందులు
- 365 గ్రామాలు ఇంకా జలదిగ్బంధంలోనే
- 15 వేల ఎకరాల పంటలకు నష్టం
- మళ్లీ భారీ వర్షాలపై ఐఎండీ హెచ్చరిక

# రెండు నిమిషాలు చాలు.. అరాచకాలు అరికట్టేస్తాం


2 లో

- రెండు నిమిషాలు చాలు అరాచకాలకు చెక్
- వైసీపీ నేతలపై చంద్రబాబు తీవ్ర విమర్శలు
- డీఎస్సీపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచన
- అక్రమాలు జరగలేదని సీఎం స్పష్టీకరణ
- కోర్టు వ్యాఖ్యలను గుర్తుచేసిన చంద్రబాబు
- జగన్ పరామర్శలపై సీఎం ఎద్దేవా వ్యాఖ్యలు

# ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

- అసెంబ్లీ షెడ్యూల్ ఖరారు
- అమరావతికి గ్రీన్ సిగ్నల్
- కొత్త పాలసీలకు ఆమోదం
- దిశా బిల్లు ఉపసంహరణ
- పుష్కర ఘాట్లకు నిధులు
- పారిశ్రామికాభివృద్ధిపై ఫోకస్



**న్యూస్ డెస్క్, 06 ఆగష్టు (బిఎన్ఎస్):** ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి కేబినెట్ సమావేశ నిర్ణయాలను వెల్లడించారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన మూడున్నర గంటలకు పైగా సుదీర్ఘంగా సాగిన ఈ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో అనేక అభివృద్ధి పనులు, కొత్త పాలసీలు, చట్ట సవరణలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. అలాగే ఏపీ వర్షాకాల అసెంబ్లీ సమావేశాల షెడ్యూల్ ఖరారు చేసింది.

ఎల్ అండ్ టీ కి క్వాంటమ్ వ్యాలీ ట్విన్ టవర్స్

అమరావతి రాజధాని నిర్మాణానికి సంబంధించి కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. క్వాంటమ్ వ్యాలీ ట్విన్ టవర్స్ నిర్మాణానికి రూ.1,002.49 కోట్లు కేటాయించేందుకు ఆమోదం తెలపడమే కాకుండా, ఈ నిర్మాణ బాధ్యతలను ఎల్ అండ్ టీ సంస్థకు అప్పగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే రాష్ట్ర అసెంబ్లీ, హైకోర్టుల ఐకానిక్ భవనాల డిజైన్ల పూర్తి కోసం అదనపు నిధుల కేటాయింపునకు ఆమోదం తెలిపింది. అమరావతిలో భూ కేటాయింపులపై మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫార్సులను కేబినెట్ ఆమోదించడంతో పాటు, అమరావతి ఐ ప్రాజెక్టుకు తిరిగి టెండర్లు (రీ-టెండర్లు) పిలిచేందుకు నిర్ణయించింది.

2 లో

# కేటీఆర్‌పై ఏసీబీ కీలక చర్య

- 75 పేజీల ఛార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేసిన ఏసీబీ
- కేటీఆర్‌తో పాటు నలుగురిపై అభియోగాలు
- రూ.46.82 కోట్ల చెల్లింపులపై దర్యాప్తు వివరాలు
- ఎలక్టోరల్ బాండ్లపై క్విడ్ ప్రోకో కోణం ప్రస్తావన
- ఐపీసీ, అవినీతి నిరోధక చట్టం కింద కేసులు
- ఫార్ములా ఈ-రేసింగ్ వ్యవహారంలో కీలక పరిణామం
- రూ.600 కోట్ల నష్టం ఆరోపణలు
- క్విడ్ ప్రోకో కోణంపైనా ప్రస్తావన

2 లో

# క్యా బోల్తీ పబ్లిక్"తో దేశవ్యాప్త పోరు

- నిరుద్యోగంపై సీజేపీ జాతీయ యుద్ధం
- దేశ రాజకీయాలపై సీజేపీ ఫోకస్
- ప్రజలే అజెండా.. సీజేపీ ప్లాన్
- నిరుద్యోగమే జాతీయ అజెండా
- జంతర్ మంతర్ నుంచి దేశవ్యాప్తంగా
- సీజేపీ నెక్స్ట్ టార్గెట్ దేశమే


2 లో

# స్థానిక ఎన్నికలపై ఫోకస్

- స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటినుంచే పూర్తి సన్నద్ధం
- మంత్రులకు నారా లోకేష్ కీలక దిశానిర్దేశం
- ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరు వివరించాలి
- కూటమి అభ్యర్థుల విజయమే ప్రధాన లక్ష్యమన్న లోకేష్
- అసెంబ్లీ వ్యూహంపై మంత్రులతో విస్తృతంగా చర్చ
- ఎల్‌నినో పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- తాగునీటికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సూచన

2 లో

# విభేదాలకు తెర.. అధ్యక్షుల ప్రకటన

- కరీంనగర్, వికారాబాద్, మేడ్చల్‌కు కొత్త అధ్యక్షుల నియామకం
- సాయి మల్లేశం, యూ.రమేశ్, గిరివర్ధన్ రెడ్డికి బాధ్యతలు
- పెండింగ్‌లో ఉన్న నియామకాలకు ఎట్టకేలకు ముగింపు
- రామచందర్ రావు ప్రకటించిన జిల్లా అధ్యక్షులు
- సయోధ్య తర్వాత ఖరారైన నియామకాలు
- ఇరు వర్గాల అంగీకారంతో తుది జాబితా
- మూడు జిల్లాల్లో సంస్థాగత మార్పులు
- బీజేపీ జిల్లా కమిటీల్లో కీలక మార్పులు

2 లో

# కేటీఆర్‌పై ఏసీబీ కీలక చర్య




**న్యూస్ డెస్క్, 06 ఆగష్టు (బిఎన్ఎస్):** ఫార్ములా ఈ-రేసింగ్ కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఏసీబీ 75 పేజీల ఛార్జిషీట్ దాఖలు చేసింది. నిబంధనలు ఉల్లంఘించి ప్రభుత్వ ఖజానాపై రూ.600 కోట్ల భారం మోపేలా నేరపూరిత కుట్ర పన్నారని ఆరోపించింది. ఈ కేసులో కేటీఆర్‌తో పాటు ఐఏఎస్ అధికారి అరవింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డి, స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు, ఫార్ములా ఈ ఆపరేషన్స్ లిమిటెడ్‌లను నిందితులుగా చేర్చింది. కేబినెట్, ఆర్థిక, న్యాయ శాఖల అనుమతులు లేకుండా నిర్ణయాలు తీసుకున్నారని ఏసీబీ పేర్కొంది. ప్రమోటర్ సంస్థ అనుబంధ కంపెనీల నుంచి బీఆర్ఎస్‌కు రూ.44 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు అందాయని, దానికి ప్రతిఫలంగా రేసింగ్ బాధ్యతలు అప్పగించారనే క్విడ్ ప్రోకో కోణాన్ని ఏసీబీ ప్రస్తావించింది. హెచ్ఎండీఏ నిధుల నుంచి రూ.46.82 కోట్లు చెల్లించారని, కేటీఆర్‌పై ఐపీసీ 409, 120బీతో పాటు అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు వెల్లడించింది.

# బట్టకాల్చి మీదేస్తే ఊరుకునేది లేదు

మొదటి పేజీ తరువాయి

గురువారం ఆయన నగరంలో మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఆధునిక యుగంలో కూడా రాష్ట్రంలో వర్షాలు కురవద్దంటూ తాను క్షుద్రపూజలు చేశానని కాంగ్రెస్ నేతలు తనపై నిందలు వేయడం సిగ్గుచేటని అన్నారు. రాజకీయాల్లో విమర్శలకు కూడా ఓ హద్దంటూ ఉంటుందని.. ఏదిపడిదే అది బట్టకాల్చి మీదేస్తే తాను ఊరుకునే రకం కాదని, ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని హరీశ్ రావు మాస్ వార్నింగ్ ఇచ్చారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపినందుకే..

గతంలో కూడా మంత్రి కొండా సురేఖ ఇలాగే నోటికొచ్చినట్లుగా మాట్లాడి గురువారం నాంపల్లి కోర్టు చుట్టూ తిరుగుతా ఉన్నారని హరీశ్ రావు అన్నారు. క్షుద్రపూజల ఆరోపణ అంశంలో ఇష్టం వచ్చిన మాట్లాడిన కాంగ్రెస్ నేతలపై క్రిమినల్ సూట్, పరువు నష్టం కేసును వేయబోతున్నానని.. ఇప్పటికే నోటీసులు కూడా ఇచ్చానని అన్నారు. మెయిన్ లీగల్ యాక్షన్‌కు ఇంకా 30 రోజుల టైమ్ ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ తప్పిదాలు, స్కాములను ఎత్తిచూపుతున్న నేపథ్యంలోనే రాజకీయంగా ఎదుర్కోలేక తనపై బురదజల్లేందుకు, డైవర్షన్ పాలిటిక్స్ కాంగ్రెస్ నేతలు పాల్పడుతున్నారని ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో మైనింగ్ స్కామ్, నాదర్‌గుల్ భూముల వ్యవహారం, గురుకుల టెండర్ల అవినీతి బయటపెట్టామనే ఆక్రోశంలో ఇలా పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రైతాంగం నీళ్లు లేక అల్లాడుతుంటే.. దేవాదులలో 10 మోటార్లు ఉన్నా.. నేటికీ 4 మోటార్లు మాత్రమే నడుస్తున్నాయని ఆరోపించారు. ప్రజల హక్కులు, రైతాంగం, విద్యార్థుల పక్షాల తాను ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటానని.. తగ్గేదేలేదని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# విభేదాలకు తెర.. అధ్యక్షుల ప్రకటన



**న్యూస్ డెస్క్, 06 ఆగష్టు (బిఎన్ఎస్):** తెలంగాణ భారతీయ జనతా పార్టీ లో గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న మూడు జిల్లాల అధ్యక్షుల నియామకం ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. రాష్ట్రంలోని కరీంనగర్, వికారాబాద్, మేడ్చల్ (అర్బన్) జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు గురువారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా సాయి మల్లేశం, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా యూ.రమేశ్ , మేడ్చల్ (అర్బన్) జిల్లా అధ్యక్షుడిగా గిరివర్ధన్ రెడ్డి లను నియమించారు.

అయితే, ఈ మూడు జిల్లాల అధ్యక్షుల ఎంపిక విషయంలో పార్టీ కీలక నేతలైన ఈటల రాజేందర్, బండి సంజయ్ నడుమ తీవ్ర విభేదాలు నెలకొన్నాయి. తమ వర్గానికి చెందిన నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఇరు నేతలు పట్టుబట్టడంతో గత కొంతకాలంగా సదరు నియామకాలను పార్టీ నాయకత్వం హోల్డ్‌లో పెట్టింది. ఇటీవల ఇరువురి నేతల మధ్య విస్తృత చర్చలు జరిగి సయోధ్య కుదరడంతో, అన్ని వర్గాలకూ ఆమోదయోగ్యమైన పేర్లను ఖరారు చేస్తూ రాష్ట్ర అధినాయకత్వం తుది నిర్ణయం తీసుకున్నది.

# ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

మొదటి పేజీ తరువాయి



రాష్ట్రంలో పెట్టుబడులు, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పలు కొత్త పాలసీలను ఆమోదించింది. పరిశ్రమలకు అనుకూల వవాతావరణం కోసం 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ యాక్ట్ - 2026'తో పాటు 'ఏపీ పీపీపీ పాలసీ - 2026' ముసాయిదాకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రోడ్డు భద్రతలో భాగంగా ప్రత్యేకంగా 'పాదచారుల భద్రత పాలసీ 2026'ను, విశాఖపట్నంలో మురికివాడల సమగ్ర అభివృద్ధి కోసం నూతన పాలసీని రూపొందించేందుకు ఆమోదముద్ర వేసింది. మున్సిపల్ భూముల లీజు గడువును పెంచేలా సంబంధిత చట్ట సవరణల ప్రతిపాదనలను ఓకే చేయడంతో పాటు, రాష్ట్రంలోని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పనితీరును మరింత సమర్థవంతంగా మార్చేందుకు వాటి పునర్వ్యవస్థీకరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

న్యాయపరమైన సంస్కరణల్లో భాగంగా గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన దిశా బిల్లు - 2019, ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు - 2024లను ఉపసంహరించుకోవాలని కేబినెట్ తీర్మానించింది. ప్రజల భద్రత, భూముల రక్షణే ధ్యేయంగా వీటి స్థానంలో మరింత పటిష్ఠమైన, సమర్థవంతమైన కొత్త చట్టాలను తీసుకురావాలని నిర్ణయించింది.

పారిశ్రామికాభివృద్ధి, టెలికాం రంగ విస్తరణపై మంత్రివర్గం ప్రత్యేక దృష్టి సారించింది. టెక్స్‌టైల్స్ పాలసీలోని వేతన సబ్సిడీ నిబంధనలకు సవరణలు చేయడంతో పాటు, కొత్తగా వచ్చే పారిశ్రామిక ప్రాజెక్టులకు మౌలిక సదుపాయాల కల్పనకు అనుమతులు ఇచ్చింది. డిజిటల్ కనెక్టివిటీ పెంచేందుకు మొబైల్ టవర్ల ఏర్పాటుకు ప్రభుత్వ భూముల కేటాయింపు, రాయితీ విద్యుత్ అందించేందుకు ఆమోదం తెలిపింది. పారిశ్రామిక అవసరాల కోసం స్థలాలను కొనుగోలు చేయాలని ఏపీఐఐసీ ని ఆదేశించింది. అలాగే తీవ్ర నష్టాల్లో ఉన్న మూడు సహకార చక్కెర కర్మాగారాలను లిక్విడేషన్ చేయడానికి నిర్ణయం తీసుకుంది.

విద్య, ఆధ్యాత్మిక రంగాలు, ఉద్యోగ కల్పనకు సంబంధించి పలు ప్రాధాన్యత నిర్ణయాలు తీసుకుంది. విద్యారంగ విస్తరణలో భాగంగా రాష్ట్రంలో రెండు కొత్త ప్రైవేట్ విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు, నూతనంగా ఏర్పాటైన జిల్లాల్లో విద్యాపాలన వేగవంతం చేసేందుకు 15 కొత్త డీఈఓ పోస్టుల సృష్టికి పచ్చజెండా ఊపింది. మరోవైపు త్వరలో రాబోయే గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం రూ.210.06 కోట్లతో పుష్కర ఘాట్లను అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేసింది.

ఇక.. ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల షెడ్యూల్‌ను కేబినెట్ ఖరారు చేసింది. ఈ నెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు శాసనసభ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని పలు కీలక సామాజిక, ఆర్థిక, పరిపాలనాపరమైన అంశాలపై ఈ సమావేశాల్లో కూలంకషంగా చర్చించనున్నట్లు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు.

# స్థానిక ఎన్నికలపై ఫోకస్



**న్యూస్ డెస్క్, 06 ఆగష్టు (బిఎన్ఎస్):** కేబినెట్ సమావేశానికి ముందు రాష్ట్ర మంత్రులతో మంత్రి నారా లోకేష్ నిర్వహించిన బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలు, అసెంబ్లీ వ్యూహం, ప్రజా సమస్యలు, ఎల్‌నినో పరిస్థితులు వంటి కీలక అంశాలపై చర్చించారు. అనుకున్న సమయానికే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని మంత్రులకు మంత్రి లోకేష్ సూచించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అత్యధిక స్థానాలను గెలుచుకునేలా ప్రతి మంత్రి, ప్రజాప్రతినిధి క్షేత్రస్థాయిలో పని చేయాలని మంత్రి నారా లోకేష్ సమావేశంలో చెప్పారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన విధ్వంసం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని గాడిలో పెట్టిన తీరును ప్రజలకు స్పష్టంగా వివరించాలని సూచించారు. ప్రతి ఇంటి వద్ద కనీసం మూడు నిమిషాలైనా గడుపుతూ ప్రభుత్వ పనితీరు, అమలు చేసిన కార్యక్రమాలు, చేపట్టిన అభివృద్ధి చర్యలను ప్రజలకు వివరించాలని లోకేష్ మంత్రులకు సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించాలని పేర్కొన్నారు.

అసెంబ్లీలో చర్చించాల్సిన అంశాలపైనా సమావేశంలో నారా లోకేష్ మంత్రులతో చర్చించారు. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులను అసెంబ్లీ వేదికగా ప్రజలకు సమగ్రంగా వివరించాలని సూచించారు. ఇటీవల జలాశయాల్లోకి వరద నీరు రావడం కొంత ఊరటనిచ్చే అంశమే అయినప్పటికీ, నీటి వినియోగంలో జాగ్రత్త అవసరమని అన్నారు. నీటి నిర్వహణలో తొలి ప్రాధాన్యాన్ని తాగునీటి అవసరాలకు, ద్వితీయ ప్రాధాన్యాన్ని పశుగ్రాసం, పశుసంవర్థక అవసరాలకు ఇవ్వాలని లోకేష్ సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రులకు సూచించారు.

# గోబర్ధన్‌కు కేబినెట్ ఆమోదం

మొదటి పేజీ తరువాయి

ఒక ప్రధాన స్తంభంగా నిలబెట్టేందుకు, దేశీయ సీబీజీ ఉత్పత్తిని ఏకంగా పదింతలు పెంచి పటిష్ఠమైన సర్క్యులర్ బయో ఎకానమీని సృష్టించేందుకు ఈ నిర్ణయం దోహదపడనుంది. "భారత వ్యర్థాలే దేశాభివృద్ధికి ఇంధనం.. గ్రామాలే స్వచ్ఛ ఇంధన ఉత్పత్తి కేంద్రాలు.. రైతులే ఇంధన భద్రతలో భాగస్వాములు" అనే స్పష్టమైన విజన్‌తో కేంద్ర ప్రభుత్వం దీనిని ముందుకు తీసుకెళ్తోంది.

అలాగే.. అస్సాంలో జాతీయ రహదారి-15 పరిధిలోని 135.871 కిలోమీటర్ల పొడవైన 4-లేన్ యాక్సెస్-కంట్రోల్డ్ గువాహాటి-తేజ్‌పూర్ కారిడార్ అభివృద్ధికి ఆమోదం తెలిపింది. ఎన్హెచ్-ఓ పథకం కింద బిల్ట్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ టోల్ మోడ్‌లో మొత్తం రూ. 8,970.20 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా తేజ్‌పూర్ బైపాస్‌లో 4.9 కిలోమీటర్ల మేర అత్యవసర ల్యాండింగ్ సౌకర్యాన్ని భారత వైమానిక దళంతో సమన్వయం చేసుకుని నిర్మిస్తారు. ఇది బ్రహ్మపుత్ర నదికి దక్షిణాన ఉన్న ప్రస్తుత ఎన్హెచ్-27 (ఈస్ట్ వెస్ట్ కారిడార్) పై వాహనాల రద్దీని గణనీయంగా తగ్గిస్తుంది. బైహాత చరియాలీ, సిపాఝార్, ఖరుపేటియా, దేకియాజులి, తేజ్‌పూర్ వంటి రద్దీగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ చిక్కులను నివారించడానికి 58.7 కిలోమీటర్ల మేర 5 ప్రధాన బైపాస్‌ల నిర్మాణాన్ని కూడా ఈ ప్రాజెక్ట్‌లో చేర్చారు.

# ఎల్‌నినో మరింత ఉధృతం..

**న్యూస్ డెస్క్, 06 ఆగష్టు (బిఎన్ఎస్):** సూపర్ ఎల్ నినో ప్రభావం రానున్న నెలల్లో మరింత ఉధృతం కానున్నది. ఆగస్టులో ఉష్ణోగ్రతలు మరింత తీవ్రమై అక్టోబర్ వరకు కొనసాగుతాయని నిపుణులు తెలిపారు. రానున్న వారాల్లో ఎల్ నినో తీవ్రతరం కావడంతో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని ఐక్యరాజ్యసమితి ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యూఎంఓ) పేర్కొంది. భారత్‌లో ఈ రుతుపవన కాలంలో వర్షపాత తీరును ప్రభావితం చేసే ప్రధాన కారకం ఎల్ నినో. రుతుపవన వర్షపాతం దీర్ఘకాల సగటు(ఎల్‌పీఏ)లో సుమారు 92 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. ఇది సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఉండే సీజన్‌ను సూచిస్తున్నది. మధ్య, దక్షిణ ద్వీపకల్ప ప్రాంతాలు, వాయువ్య భారత్‌లోని కొన్ని భాగాలు తేమ కొరత ప్రమాదంలో ఉన్నాయి. ఈశాన్యంలోని అస్సాం గత కొన్నేండ్లలో ఎన్నడూ లేని విధంగా తీవ్రమైన వరదలతో పోరాడుతున్నది.

నిప్పుల కొలిమిలా ఐరోపా

ఎల్ నినో ప్రభావంతో ఐరోపా ఇప్పటికే అనేక వడగాలులను చవిచూసింది. భారత్‌లో రుతుపవన చక్రం దెబ్బతినగా ప్రపంచంలోని అనేక ఇతర ప్రాంతాలు తీవ్ర ఉష్ణోగ్రతలను ఎదుర్కొంటున్నాయి. రానున్న రోజుల్లో దీని ప్రభావం మరింత ఉగ్రరూపం దాల్చనున్నది. ఎల్ నినో కేవలం మన గుమ్మం వద్దే లేదు. అది మన ఇంటి లోపలకు వచ్చి ఉష్ణోగ్రతలను పెంచుతున్నది అని యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ అన్నారు. ఇది కేవలం ఆరంభం మాత్రమే అని హెచ్చరించిన ఆయన ఎల్ నినో మరింత బలపడుతున్నది. ఇప్పటికే అధిక ఉష్ణోగ్రతలు, వినాశకరమైన కార్చిచ్చులు, రికార్డు స్థాయి సముద్రపు వేడితో అట్టుడికిపోతున్న భూమికి ఇది మరింత ఆజ్యం పోస్తున్నది అని పేర్కొన్నారు. ముఖ్యంగా ఐరోపా అంతా ఒక నిప్పుల కొలిమిలా మారిపోయింది. ఫ్రాన్స్‌లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పెద్ద ప్రాంతాలను కార్చిచ్చులు చుట్టుముట్టాయి. బోర్డోలో చెలరేగిన ఒక భారీ అగ్నిప్రమాదం కారణంగా మెరుపులు, ఉరుములతో నిండిన ఒక మేఘం ఏర్పడింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అత్యంత తీవ్రమైన అగ్నిప్రమాద సంక్షోభంగా పేర్కొంటూ ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్

మాక్రాన్ అత్యవసర పరిస్థితిని ప్రకటించడంతో 2 లక్షల మందికి పైగా ప్రజలు తమ ఇండ్లను వదిలి వెళ్లాల్సి వచ్చింది. డెన్మార్క్, జర్మనీ, పోలాండ్ దేశాలు కూడా అత్యధిక ఉష్ణోగ్రతలను నమోదు చేశాయి. జూలై చివరి నాటికి యూరోపియన్ యూనియన్ వ్యాప్తంగా 4.35 లక్షల హెక్టార్లకు పైగా భూమి అగ్నికి ఆహుతైంది. దీంతో ఇది రికార్డు స్థాయిలో అత్యంత తీవ్రమైన అగ్ని ప్రమాద కాలాలలో ఒకటిగా నిలిచింది.

మండుతున్న అమెరికా

అమెరికాలో కూడా అధిక ఉష్ణోగ్రతలు, వేడి పరిస్థితులు నెలకొన్నాయి. ఉటాలోని సాల్ట్ లేక్ సిటీలో ఉష్ణోగ్రతలు 42.8 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకున్నాయి. ఉత్తర కరోలినాలో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల సెల్సియస్‌కు చేరాయి. పశ్చిమ, గ్రేట్ ప్లెయిన్స్ ప్రాంతాలను తీవ్రమైన వడగాలులు చుట్టుముట్టగా దక్షిణ, మధ్య ప్రాంతాలలో ఈ సీజన్ ఆరంభంలోనే తీవ్రమైన కరువు ఏర్పడింది. కొలరాడో, ఇడాహూ, మోంటానా, నెవాడాలలో వేసవిలో పిడుగుపాట్లు, అగ్నిప్రమాదాలు సంభవించాయి.

# అస్సాంలో వరద బీభత్సం..



**న్యూస్ డెస్క్, 06 ఆగష్టు (బిఎన్ఎస్):** అస్సాం లో వరదలు బీభత్సం సృష్టించాయి. ఈ వరదల కారణంగా మరణించిన వారి సంఖ్య 95 కి చేరింది. ఈ వరదలవల్ల రాష్ట్రవ్యాప్తంగా 25 జిల్లాలపై తీవ్ర ప్రభావం పడింది. చాలా ప్రాంతాల్లో వరద నీరు తగ్గుముఖం పడుతున్నప్పటికీ ఇప్పటికీ 365 కిపైగా గ్రామాలు నీట మునిగే ఉన్నాయి. సుమారు 1.22 లక్షల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా 15 వేలకుపైగా ఎకరాల్లో పంట భూమి దెబ్బతిన్నది.

విపత్తు తీవ్రతను పరిశీలించేందుకు అస్సాం సీఎం హిమాంత కేంద్రమంత్రి జేపీ నడ్డాతో కలిసి ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. మరోవైపు పొరుగు రాష్ట్రాలైన మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్‌లలో రాబోయే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. దాంతో అస్సాంలో మళ్లీ వరద ముప్పు పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

# క్యా బోల్తీ పబ్లిక్"తో దేశవ్యాప్త పోరు



**న్యూస్ డెస్క్, 06 ఆగష్టు (బిఎన్ఎస్):** నీట్ పేపర్ లీక్ పై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వేలాది మంది విద్యార్థులతో 36 రోజులపాటు నిరసనలు చేసి.. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో రాజీనామా చేయించి విజయం సాధించిన సీజేపీ ప్రతినిధులు తమ భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. సెప్టెంబర్ లో "క్యా బోల్తీ పబ్లిక్" పేరిట జాతీయస్థాయిలో కార్యక్రమం నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ చీఫ్ అభిజీత్ దీప్కే వెల్లడించారు. ఇందులో నిరుద్యోగాన్నే ప్రధాన సమస్యగా తీసుకుని.. దానినే జాతీయ అంశంగా మారుస్తామని తెలిపారు. దేశవ్యాప్తంగా సమస్యలను తెలుసుకునేలా ఈ కార్యక్రమం ఉండబోతోందన్న సీజేపీ ప్రతినిధులు.. త్వరలోనే రాంచీ వెళ్లనున్నారు.

మహారాష్ట్రలోని తన స్వగ్రామం ఛత్రపతి శంభాజీనగర్‌లో నిర్వహించిన సీపీజేపీ కోర్ టీమ్ సమావేశం ముగిసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ ప్రచారంలో విద్యా రంగానికి కూడా ఇస్తున్నట్లు దీప్కే వెల్లడించారు. దేశంలో బడి, కళాశాలలు, కోచింగ్ ఫీజులు విపరీతంగా పెరిగిపోయాయని, మొదటి తరగతి చదువుకే రూ.1 లక్ష నుండి రూ. 2 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తూ విరాళాల పేరుతో అదనంగా దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. సాధారణ, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన విద్య అందుబాటులో లేకుండా పోయిందని, పిల్లలను ఉన్నత చదువులు చదివించాలంటే తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ప్రకారం విద్య అనేది ప్రాథమిక హక్కు అని, కానీ గత కొన్నేళ్లుగా దాన్ని కొందరు వ్యాపారంగా మార్చేశారని ఆయన తీవ్రంగా విమర్శించారు.

ఇటీవల జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన కేవలం నీట్ లేదా విద్యా వ్యవస్థకు మాత్రమే పరిమితం కాలేదని, అది ప్రస్తుతం దేశంలో ఉన్న రాజకీయ వ్యవస్థపై ప్రజల్లో నెలకొన్న తీవ్ర ఆగ్రహానికి నిదర్శనమని దీప్కే పేర్కొన్నారు. ప్రజలు ప్రజాస్వామ్య వ్యవస్థలపై నమ్మకం కోల్పోతున్నారని, గెలిచిన నాయకులు పార్టీలు మారడం సాధారణమైపోయిందని దుయ్యబట్టారు. న్యాయ వ్యవస్థ తటస్థతపై కూడా ఆయన పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఇటీవల కోర్టులు ఇస్తున్న తీర్పులు అధికార పక్షాలకే అనుకూలంగా ఉంటున్నాయని, బడా వ్యాపారవేత్తలకు, రాజకీయ పార్టీల చీలికలు లేదా ఎమ్మెల్యేల చేరికల వివాదాలకు త్వరితగతిన విచారణ జరిపి తీర్పులు ఇచ్చే న్యాయస్థానాలు, సాధారణ పౌరుడు న్యాయం కోసం వస్తే మాత్రం ఏళ్ల తరబడి వాయిదాలు వేస్తున్నాయని ఆరోపించారు. సాధారణ ప్రజలకు త్వరితగతిన న్యాయం అందకపోవడం కోర్టుల సమగ్రత, పారదర్శకతపై పెద్ద ప్రశ్నార్థకంగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు.

## రెండు నిమిషాలు చాలు.. అరాచకాలు అరికట్టేస్తాం



**న్యూస్ డెస్క్, 06 ఆగష్టు (బిఎన్ఎస్):** రెండు నిమిషాలు చాలని, వైసీపీ నేతల అరాచకాలకు చెక్ పెట్టేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. అమరావతి సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయం ముసుగులో మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి నేరాలకు పాల్పడుతున్నారని చంద్రబాబు మండిపడ్డారు. డీఎస్సీ పై కావాలని రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. డీఎస్సీలో అక్రమాలు జరగలేదని, కోర్టు చివాట్లు పెట్టినా నానా యాగి చేయడం మాత్రం ఆపడంలేదని ఫైర్ అయ్యారు. డీఎస్సీపై వైసీపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పి కొట్టాలని టీడీపీ నేతలకు సీఎం చంద్రబాబు సూచించారు. జగన్ పరామర్శలకు వస్తున్నారంటే జనం భయపడే పరిస్థితి ఉందని చంద్రబాబు ఎద్దేవా చేశారు.

# స్మార్ట్ కార్డుల శంఖారావం

మొదటి పేజీ తరువాయి




అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఆహార భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.05 కోట్ల మంది లబ్ధిదారులకు కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను అందించనున్నారు. ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో కార్డులు మంజూరైనా.. భౌతికంగా కార్డులు అందని కుటుంబాలకు కూడా ఈ పంపిణీ ద్వారా ఉపశమనం లభించనుందని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

ఈసారి పంపిణీ చేసే రేషన్ కార్డులను ఆధునిక టెక్నాలజీతో రూపొందించారు. పీవీసీ మెటీరియల్‌తో తయారు చేసిన లామినేటెడ్ స్మార్ట్ కార్డులపై క్యూఆర్ కోడ్‌తో పాటు భద్రతా ఫీచర్లను ఏర్పాటు చేశారు. వాటర్‌ప్రూఫ్‌గా, క్రెడిట్ కార్డు పరిమాణంలో ఉండే ఈ స్మార్ట్ కార్డులు ఎక్కువ కాలం ఉపయోగపడేలా తయారు చేశారు.

ఈ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లా యంత్రాంగానికి ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. రేషన్ లబ్ధిదారుల తుది జాబితాల పరిశీలన, ఈ-కేవైసీ పూర్తి చేయడం, కార్డుల ముద్రణ, రవాణా, పంపిణీ కేంద్రాల ఏర్పాటు వంటి అన్ని ఏర్పాట్లను సమగ్రంగా పూర్తి చేయాలని అధికారులకు కీలక సూచనలు చేశారు. ప్రతి నియోజకవర్గంలో రెవెన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్లు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

రాష్ట్రంలో ఉన్న పేద కుటుంబాలకు ఆహార భద్రతను కల్పించడంతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులందరికీ చేరేలా చూడడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రేషన్ కార్డుల పంపిణీ రాష్ట్ర సంక్షేమ పాలనలో మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

## జగన్ దెబ్బకు చంద్రబాబు 'అవిగన్' అంటున్నారు: మాజీ మంత్రి పేర్ని నాని



**న్యూస్ డెస్క్, 06 ఆగష్టు (బిఎన్ఎస్):** వైసీపీ అధినేత జగన్ దెబ్బకు సీఎం చంద్రబాబు నాయుడు'అవిగన్' అంటున్నారని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. జగన్ మావిగన్ ప్రాతిపదన తీసుకొచ్చిన నేపథ్యంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లి వైసీపీ కార్యాలయంలో మాట్లాడుతూ అమరావతి, గుంటూరు, విజయవాడను కలిపి రాజధానిగా సీఎం చంద్రబాబు నాయుడు సీఆర్డీఏలో తీర్మానం చేశారని తెలిపారు. దీన్ని రేపో, మాపో కేబినెట్ ముందుకు తీసుకువచ్చి తీర్మానం కూడా చేస్తారని పేర్ని నాని చెప్పారు. అనంతరం అసెంబ్లీలోనూ ప్రవేశ పెడతారని వ్యాఖ్యానించారు. మచిలీపట్నంలో చంద్రబాబు బంధువుల లేరని, అందువల్ల తమ ప్రాంతాన్ని వదిలేశారని పేర్ని నాని వ్యాఖ్యానించారు

# బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డ్ అందుకున్న సైదాపురం పిఎసిఎస్ ఛైర్మన్ అమ్మినేని సుబ్రమణ్యం నాయుడు



నెల్లూరు జిల్లా సైదాపురం (బిఎన్ఎస్): -నెల్లూరు జిల్లా సైదాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రస్థాయిలో ఉత్తమ పనితీరు కనబరిచిన సంఘంగా ఎంపికైంది.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు 63వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా విజయవాడలోని గవర్నర్పేటలో మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమానిలో ఉత్తమ సేవలు అందించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సైదాపురంకు సంబం ధించి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను.పీఏసీఎస్ అధ్యక్షుడు అమ్మినేని సుబ్రమణ్యం నాయుడు. సీఈవో బంకారపు శ్రీనివాసులురావుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ ఆర్పి రామకృష్ణ, నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. సైదాపురం పీఏసీఎస్ రాష్ట్రస్థాయిలో ఉత్తమ సంఘంగా గుర్తింపు పొందడం సహకార సంఘం పాలకవర్గం,అధికారులు, సిబ్బంది.సభ్య రైతులు పలువురు గర్వకారణమైనదిగా అభిప్రాయం వ్యక్తం చేసిన పీఏసీఎస్ అధ్యక్షుడు అమ్మినేని సుబ్రమణ్యం నాయుడు.

# ఆంజనేయస్వామి పూజలో పాల్గొన్న ప్రసాద్ నాయుడు



నెల్లూరు జిల్లా రాపూరు (బిఎన్ఎస్): -నెల్లూరు జిల్లా రాపూరు మండలం కంబాలపల్లి పంచాయతీ పరిధిలోని కుమ్మరిగుంట కొత్త ఎస్సీ కాలనీలో గురువారం నిర్వహించిన శ్రీ శ్రీ ఆంజనేయస్వామి ప్రత్యేక పూజా కార్యక్రమంలో టీడీపీ తిరుపతి పార్లమెంట్ వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి, క్లస్టర్-4 ఇంచార్జ్ తిక్కమనేని ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో విలసిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు నీలం పూర్ణచంద్రారెడ్డి, నిప్పట్లపల్లి పెంచలయ్య, నిప్పట్లపల్లి రత్నయ్య, నిప్పట్లపల్లి శివరామయ్య, పెంచలయ్య మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కడపజిల్లావ్యాప్తంగా పలువురు ఎస్ఐల బదిలీలు.

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 06: కడపజిల్లా వ్యాప్తంగా పలువురు ఎస్సైల బదిలీలు జరుగుతున్న క్రమంలో.. సింహాద్రిపురం ఎస్ఐ డాక్టర్ నాయక్ కడప విఆర్ కు అటాచ్ చేయడం జరిగింది.

తొండూరు ఎస్సై ఘన మద్దిలేటి సింహాద్రిపురం ఎస్సైగా బదిలీ, వల్లూరు ఎస్సై శివ నాగిరెడ్డి తొండూరు ఎస్సైగా బదిలీ.

బి కోడూరు ఎస్సై సూర్యనారాయణ రెడ్డి వల్లూరు ఎస్సైగా బదిలీ. వేంపల్లి ఎస్ఐ తాయారు హుస్సేన్ బి. కోడూరు ఎస్సైగా బదిలీ. కమలాపురం ఎస్సై విద్యాసాగర్ కొండాపురం ఎస్ఐగా బదిలీ. పొద్దుటూరు వన్ టౌన్ ఎస్ఐ శ్రీనివాసులు కమలాపురం ఎస్సైగా బదిలీ. ప్రొద్దుటూరు త్రీ టౌన్ ఎస్సై మొయినిద్దీన్ ప్రొద్దుటూరు వన్ టౌన్ ఎస్ఐగా బదిలీ. కొండాపురం ఎస్ఐ జయరాములు బద్వేల్ అర్బన్ ఎస్సైగా బదిలీ. బద్వేల్ అర్బన్ ఎస్సై చిరంజీవి రూరల్ ఎస్సైగా బదిలీ. బద్వేలు రూరల్ ఎస్సై రంగారావు అర్బన్ ఎస్సైగా బదిలీ. బద్వేల్ అర్బన్ ఎస్ఐ కొండారెడ్డి కడప 2 టౌన్ ఎస్సైగా బదిలీల ప్రక్రియ కొనసాగించినట్లు కడప ఎస్పీ నచకేత్ విశ్వనాథ్ అధికారికంగా ధ్రువీకరించారు.

# మైదుకూరులో 50 మంది లబ్ధిదారులకు 52.21 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ...




బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 06: ప్రొద్దుటూరు క్యాంపు కార్యాలయంలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మైదుకూరు నియోజకవర్గానికి చెందిన 50 మంది లబ్ధిదారులకు మొత్తం 52,21,810/- విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన ప్రతి సమయంలో అండగా నిలవడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందిస్తున్న ఆర్థిక సహాయం వారి కుటుంబాలకు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా నిరంతరం కృషి జరుగుతోందని పేర్కొన్నారు. మైదుకూరు నియోజకవర్గ ప్రజలకు అవసరమైన ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి న్యాయం జరిగేలా తాము ఎల్లప్పుడూ కృషి చేస్తామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# గండి గురుకుల పాఠశాల లో దారుణం.

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 06: చక్రాయపేట మండలం గండి గురుకుల పాఠశాల లో దారుణం చోటుచేసుకుంది. పాఠశాల నందు ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థి అఖిలానందన్ ను సైన్స్ టీచర్ జావిద్ తీవ్రంగా శరీరం మీద వాతలు పడేలా చావు దెబ్బలు కొట్టారు. ఈ దెబ్బలకు తాళలేక స్పృహ కోల్పోయిన విద్యార్థి అఖిలానందన్ ను స్పృహ కోల్పోయిన అలానే వదిలేసి వెళ్లిపోయిన సైన్స్ టీచర్ జావిద్. తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చిన తోటి విద్యార్థులు. తప్పయింది క్షమించండి అంటూ 5000 నగదు చేతిలో పెట్టి చేతులు దులుపుకున్న గురుకుల పాఠశాల సిబ్బంది. అంటూ తల్లిదండ్రుల ఆవేదన వ్యక్తం చేశారు.

# డీఎస్సీపై సీబీఐ విచారణ జరపాలి

## వెంకటగిరిలో వైఎస్ఆర్సీపీ రిలే నిరాహార దీక్ష

## నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి -నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త మల్లి రామ్ కుమార్ రెడ్డి డిమాండ్



ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి(బిఎన్ఎస్): -డీఎస్సీ నియామకాల్లో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వెంకటగిరిలో వైఎస్ఆర్సీపీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, నిరుద్యోగులు, మేధావుల ఫోరం ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరై మద్దతు తెలిపారు.

ఏపీ జెన్-జెడ్ వార్ కార్యక్రమంలో భాగంగా గురువారం వెంకటగిరి ఎంపీడీవో కార్యాలయం సెంటర్ వద్ద వెంకటగిరి నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష నిర్వహించారు.

ఈ దీక్షలో వైఎస్ఆర్సీపీ విద్యార్థి విభాగం నాయకులు, డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగ యువత, మేధావుల ఫోరం ప్రతినిధులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ డీఎస్సీ నియామకాల్లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అవకతవకలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అభ్యర్థులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

నీట్ పరీక్షల అవకతవకల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసినట్లే, డీఎస్సీపై వస్తున్న ఆరోపణల దృష్ట్యా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కూడా నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అదేవిధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకుని డీఎస్సీ వ్యవహారంపై స్పష్టత ఇవ్వాలని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడవద్దని హెచ్చరించారు. పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనేవిడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ నిరసన కార్యక్రమంలో వెంకటగిరి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి పరిశీలకురాలు కోడూరు కల్పలత,మాజీ కౌన్సిలర్లు,నెల్లూరు జిల్లా వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ దందోలు లక్ష్మీ నారాయణరెడ్డి, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు, మండల పార్టీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, డీఎస్సీ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# "ఎల్నినో " పట్ల ఆందోళన అవసరం లేదు...!!

- జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి
- జిల్లాలో సమగ్ర కార్యాచరణతో ప్రత్యామ్నాయ చర్యలు
- ముందస్తు ప్రణాళికతో సాగు, తాగునీటికి ఇబ్బంది రాకుండా చర్యలు
- జిల్లాలో పరిస్థితులు, ప్రత్యామ్నాయ చర్యలను పిపిటి ద్వారా వివరించిన కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి
- సమీక్షలో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేలు.. పలు కీలక సూచనలు, సలహాలు



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 06: "ఎల్నినో " ప్రభావంతో ఈ ఏడాది జిల్లాలో వర్షపాతం తగ్గినప్పటికీ.. ముందస్తు ప్రణాళిక, జలవనరుల సమర్థ నిర్వహణ, శాఖల సమన్వయంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఎల్నినో పరిస్థితులను ముందుగానే అంచనా వేసి ప్రతి శాఖ కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉంటే కరవు ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో ఎల్నినో పరిస్థితులను ఎదుర్కొనే సన్నద్ధత చర్యలపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే సి. ఆదినారాయణ రెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే కొత్త కృష్ణ చైతన్య రెడ్డి, జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా, రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావనతో పాటు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పవర్పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో ఎల్నినో ప్రభావం, వర్షపాతం పరిస్థితులు, భూగర్భ జలాల స్థితి, జలాశయాల్లో నీటి నిల్వలు, ఖరీఫ్ సాగు పురోగతి, సహజ వ్యవసాయం, రైతులకు అందిస్తున్న సాంకేతిక సూచనలు, పశు సంవర్ధక, తాగునీటి భద్రత, ప్రజారోగ్యం, శాఖల వారీ కార్యాచరణ ప్రణాళికలను సమగ్రంగా వివరించారు. జిల్లా ప్రధానంగా వర్షాధార, భూగర్భ జలాలపై ఆధారపడిన వ్యవసాయ ప్రాంతమని, సాగులో అధిక భాగం బోరు నీటి ద్వారానే సాగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రధాన జలాశయాల ద్వారా సాగునీరు, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటి సరఫరా కొనసాగుతోందన్నారు. ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో సాధారణంతో పోలిస్తే 47.3 శాతం వర్షాభావం నమోదైందని, జూన్లో 68 మిల్లీమీటర్లకు బదులుగా 50 మిల్లీమీటర్లు, జూలైలో 97 మిల్లీమీటర్లకు బదులుగా కేవలం 24 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైందని తెలిపారు. జూన్ నుంచి ఆగస్టు 6 వరకు నమోదైన ఈ వర్షాభావం ఎల్నినో ప్రభావానికి స్పష్టమైన సూచిక అని పేర్కొన్నారు. జిల్లాలోని జలాశయాల్లో మొత్తం నిల్వ సామర్థ్యం 82.26 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం సుమారు 39.88 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. గత మార్చిలోనే జలాశయాలతో పాటు వాటి పరిధిలోని చెరువులను నింపడం వల్ల ప్రస్తుతం దాదాపు 50 శాతం మేర నీటి నిల్వలు కొనసాగుతున్నాయని చెప్పారు. దీంతో ఖరీఫ్, రబీ సాగుతో పాటు వచ్చే వేసవి వరకు తాగునీటి అవసరాలను కూడా నిర్వహించే పరిస్థితి ఉందన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటి విడుదల ప్రారంభం కావడంతో జీఎన్ఎస్ఎస్ పరిధిలోని జలాశయాల్లో నీటి నిల్వలు మరింత పెరిగే అవకాశం ఉందని వివరించారు. భూగర్భ జలమట్టం గత ఏడాదితో పోలిస్తే సగటున 0.79 మీటర్లు తగ్గిందని, కొన్ని మండలాల్లో 41 నుంచి 45 మీటర్ల లోతులో నీటి మట్టం నమోదవుతోందని

తెలిపారు. అయితే దీనికి కేవలం వర్షాభావమే కాకుండా ఆయా ప్రాంతాల భౌగోళిక నిర్మాణం కూడా కారణమని చెప్పారు. అలాంటి మండలాలపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. ఖరీఫ్లో ఇప్పటివరకు సుమారు 70,539 హెక్టార్లలో, అంటే సాధారణ విస్తీర్ణంలో 22.9 శాతం మేర విత్తనాలు పూర్తయ్యాయని తెలిపారు. వేరుశెనగ, పత్తి, పెసర, కంది, సోయాబీన్, పొద్దుతిరుగుడు తదితర పంటల సాగు కొనసాగుతోందని, రాబోయే 7 నుంచి 10 రోజుల్లో మంచి వర్షాలు కురిస్తే సాగు విస్తీర్ణం సాధారణ స్థాయికి చేరుకునే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎల్నినో ప్రభావాన్ని తగ్గించేందుకు పంటలు, నీటి నిర్వహణ, భూగర్భ జలాల మౌలిక వసతుల బలోపేతం, రైతులకు సహాయక చర్యలు, పశుసంపద సంరక్షణ అనే నాలుగు ప్రధాన అంశాలపై సమగ్ర కార్యాచరణ రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి వారం రైతులకు శాస్త్రీయ వ్యవసాయ సలహాలు అందించడంతో పాటు, రాబోయే ఏడు రోజులు, ఎనిమిది వారాల వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని శాఖల వారీగా కార్యాచరణ ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. సహజ వ్యవసాయం ద్వారా ఎల్నినో ప్రభావాన్ని తగ్గించే చర్యలను కూడా ప్రజెంటేషన్లో వివరించారు. ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్), విత్తన గుళికల తయారీ, బహుళ పంటల సాగు, జీవ ఎరువుల వినియోగం, కరువు నివారణ నమూనాలు, హాఫ్మూన్ విధానం వంటి వాతావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులను జిల్లావ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 97,960 మంది రైతులను 1,19,013 ఎకరాల్లో ఈ కార్యక్రమాల కింద లక్ష్యంగా పెట్టుకున్నామని, అధిక ప్రమాద మండలాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. జీవ వనరుల కేంద్రాల ద్వారా సహజ వ్యవసాయ ఉత్పాదకాలు అందుబాటులో ఉంచడం, రైతులకు శిక్షణలు, విత్తన కిట్ల పంపిణీ, పాఠశాలలు, అంగన్వాడీలు, స్మార్ట్ కిచెన్లకు సహజ వ్యవసాయ ఉత్పత్తులను అనుసంధానం చేయడం వంటి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. వ్యవసాయంతో పాటు ఉద్యానవనం, పశు సంవర్ధక, తాగునీరు, ప్రజారోగ్యం, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. పంటల మార్పిడి, ప్రత్యామ్నాయ పంటలు, సూక్ష్మ సాగునీటి విధానాలు, నీటి పొదుపు, మల్చింగ్, పంటల బీమా నమోదు, రైతులకు నిరంతర సాంకేతిక సూచనలు, పశుగ్రాస నిల్వలు, పశువైద్య సేవలు, తాగునీటి వనరుల పరిరక్షణ, వ్యాధుల నివారణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు కూడా పలు కీలక సూచనలు చేశారు. ఎల్నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రాంతానుకూల ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను రైతులకు ముందుగానే అందుబాటులో ఉంచాలని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి సూచించారు. పశుగ్రాసంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ సి. ఆదినారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లాలోని ఉపాధి హామీ కూలీలు, సంఘటిత, అసంఘటిత కార్మికులను ఈ-శ్రమ్ ద్వారా నమోదు చేయించి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని డ్వామా, డీఆర్డీఏ, మెప్మా అధికారులకు సూచించారు. స్వయం సహాయక సంఘాలకు అందించే రుణాలను ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులు, జీవనోపాధి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధంగా వినియోగించేలా రుణ ప్రణాళిక రూపొందించాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్కు సూచించారు. జిల్లాలోని వాస్తవ పరిస్థితులను ప్రతిరోజూ సమీక్షిస్తూ, నీటి వనరులను అత్యంత పొదుపుగా వినియోగించడం, రైతులకు ఎప్పటికప్పుడు సాంకేతిక సూచనలు అందించడం, శాఖల మధ్య సమన్వయంతో ముందస్తు చర్యలను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులు ఆందోళన చెందకుండా వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ, వర్షాల పరిస్థితిని బట్టి సాగు నిర్ణయాలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.

## కర దీపికల ఆవిష్కరణ...

"ఎల్ నినో " పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర వ్యవసాయ అనుబంధ మంత్రిత్వ శాఖ ప్రచురించిన ప్రత్యేక కర దీపికలను జిల్లా కలెక్టర్.. ప్రజాప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఇంజినీర్లు, వ్యవసాయ, ఉద్యాన, ప్రకృతి సేద్యం, పశు శాఖ, ఎపిఎంఐపీ, డ్వామా, డీఆర్డీఏ, ఎల్డిఎం, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్ జయంతి వేడుకల్లో మంత్రి కోమటిరెడ్డి




నల్లగొండ (బిఎన్ఎస్): తెలంగాణ ఏర్పాటే తన జీవిత లక్ష్యంగా కృషిచేసిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. విద్యార్థి దశ నుండి చనిపోయే వరకు తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లో నింపి తెలంగాణపై

అవగాహన తీసుకొచ్చిన వ్యక్తి అని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చిన వ్యక్తుల్లో ప్రొఫెసర్ జయశంకర్ ముందు వరుసలో ఉంటారని అన్నారు. ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా నల్గొండలోని ఇందిరా భవన్లో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలలో మంత్రి పాల్గొనీ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.. అలాగే ప్రజా గాయకుడు గద్దర్ వర్ధంతి సందర్భంగా గద్దర్ చిత్రపటానికి కూడా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ కోసమే పుట్టిన వ్యక్తి అని, విద్యార్థి దశనుండే కాకుండా, పదవి విరమణ పొందిన తర్వాత కూడా తెలంగాణ కోసం ఆయన కృషి చేశారని చెప్పారు. నీళ్లు, నిధులు, నియామకాలలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని పలు సందర్భాలలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ తెలంగాణ తెచ్చుకోవాల్సిన అవసరాన్ని తెలియజేశారని అన్నారు.. ప్రజా యుద్ధనౌక గా పేరుపొందిన గద్దర్ తన పాటల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువచ్చారని తెలుపుతూ గద్దర్ కు ఘన నివాళులర్పించారు.

# మెడికో విద్యార్థిని ప్రియాంకకు న్యాయం చేయాలి...

## ర్యాష్ డ్రైవింగ్, అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలి: కాంగ్రెస్ నేతల హెచ్చరిక



రాజమహేంద్రవరం:(బీఎన్ఎస్)ఆగస్టు :5రాజమహేంద్రవరంలోని ఏవీ అప్పారావు రోడ్డులో మెడికో విద్యార్థిని ప్రియాంక కారు ఢీకొని తీవ్రంగా గాయపడిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది. వైద్య విద్యను అభ్యసిస్తూ సమాజానికి సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న ఓ యువతి నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు బలికావడం అత్యంత దురదృష్టకరమని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, రాజమండ్రి సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులను వెంటనే గుర్తించి అరెస్టు చేయడంతో పాటు బాధితురాలికి సంపూర్ణ న్యాయం జరిగే వరకు ప్రభుత్వం, పోలీసులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

గురువారం విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక మెడికో విద్యార్థి వెనుక ఒక కుటుంబం కలలు, తల్లిదండ్రుల కష్టార్జిత సంపాదన, ఎన్నో సంవత్సరాల శ్రమ దాగి ఉంటాయని పేర్కొన్నారు. అలాంటి విద్యార్థిని నిర్లక్ష్యంగా వాహనం నడిపిన వ్యక్తుల కారణంగా ప్రాణాపాయ స్థితికి చేరుకోవడం సమాజానికి సిగ్గుచేటన్నారు. బాధితురాలు ప్రియాంక త్వరగా కోలుకుని తిరిగి తన వైద్య విద్యను కొనసాగించాలని ఆకాంక్షిస్తూ, ఆమె కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

నగరంలో ర్యాష్ డ్రైవింగ్ రోజురోజుకూ పెరిగిపోతున్నా దానిని అరికట్టడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. అధిక వేగంతో వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనలను బేఖాతరు చేయడం, యువతలో బాధ్యతారాహిత్య డ్రైవింగ్ పెరగడం వల్ల అమాయకుల ప్రాణాలు బలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరిగిన తర్వాత కేసులు నమోదు చేయడం కాదు, ముందుగానే ప్రమాదాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పోలీసు శాఖపై ఉందన్నారు.

బాధితురాలు ప్రియాంకకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని, అత్యుత్తమ వైద్య చికిత్సను పూర్తిగా ప్రభుత్వ ఖర్చుతో అందించాలని, అవసరమైతే ప్రత్యేక ఆర్థిక సహాయం ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నగరంలో ట్రాఫిక్ నియంత్రణ, మహిళల భద్రత, నేర నియంత్రణ కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు.

"ప్రజల ప్రాణాలు కంటే గొప్పది ఏదీ కాదు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి అమాయకుల జీవితాలతో చెలగాటమాడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదు. మెడికో విద్యార్థిని ప్రియాంకకు సంపూర్ణ న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుంది. చట్టం అందరికీ సమానమని ప్రభుత్వం, పోలీసులు తమ చర్యల ద్వారా నిరూపించాలి" అని టీకే విశ్వేశ్వరరెడ్డి, బాలేపల్లి మురళీధర్ స్పష్టం చేశారు.

# డీఎస్సీ వివాదం: మంత్రి రాజీనామాకు వైఎస్సార్‌సీపీ డిమాండ్..

## సోషల్ మీడియాలో సెటైర్లు




రావులపాలెం, (బీఎస్ఎస్)ఆగస్టు: 6 డీఎస్సీ నియామకాల నిర్వహణపై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. డీఎస్సీ పరీక్షల నిర్వహణలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రావులపాలెంలోని పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద భారీ రిలే నిరాహార దీక్ష చేపట్టింది.

ఈ సందర్భంగా పార్టీ నాయకుడు చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ, డీఎస్సీ పరీక్షల నిర్వహణపై వచ్చిన ఆరోపణలకు ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టమైన సమాధానం ఇవ్వకపోవడం లక్షలాది మంది నిరుద్యోగ యువతను అయోమయంలోకి నెట్టిందన్నారు. ఉద్యోగాల కోసం సంవత్సరాలుగా కష్టపడి సిద్ధమైన అభ్యర్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపించారు. మెరిట్ జాబితా, మార్కులు, ఎంపిక ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం ప్రజల ముందుంచి అనుమానాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు.

దేశంలో పరీక్షల నిర్వహణలో అవకతవకలు జరిగిన సందర్భాల్లో కేంద్ర స్థాయిలో నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామాలు జరిగిన ఉదాహరణలు ఉన్నాయని పేర్కొన్న ఆయన, రాష్ట్రంలో మాత్రం అలాంటి నైతిక ప్రమాణాలు ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. డీఎస్సీ అక్రమాలపై స్వతంత్ర, నిష్పక్షపాత విచారణ జరిగే వరకు, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు, విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

విద్యా రంగాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపిస్తూ, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన నిధులు సకాలంలో విడుదల కాక వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికీ పాఠ్యపుస్తకాల పంపిణీ పూర్తికాకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. క్రీడలు, విద్య, ఉద్యోగాల్లో ప్రతిభకు బదులుగా రాజకీయ అనుకూలతకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు.

డీఎస్సీ వ్యవహారంపై సోషల్ మీడియాలోనూ తీవ్ర చర్చ సాగుతోంది. ఈ వివాదం నేపథ్యంలో, "ఇలాంటి వివాదాలు తలెత్తకుండా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముందుజాగ్రత్తగా డీఎస్సీ నిర్వహించలేదేమో" అంటూ కొందరు యువత వ్యంగ్య వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఈ పోస్టులు విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. అయితే, ఇవి సోషల్ మీడియాలో వ్యక్తమైన అభిప్రాయాలు మాత్రమే కాగా, వాటిపై అధికారిక స్పందన వెలువడలేదు.

యువత, విద్యార్థుల హక్కుల కోసం ప్రారంభించిన ఈ ఉద్యమం ఒక్కరోజుతో ముగిసేది కాదని, డీఎస్సీ వ్యవహారంలో పూర్తి పారదర్శకత పాటించి బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్పష్టం చేశారు

# వాస్తవాలు నిర్ధారించాకే వార్తలు ప్రచురించాలి

## వేలేరు తహసీల్దార్ కోమి




**బిఎన్ఎస్ న్యూస్ హనుమకొండ, ఆగస్టు 6**

తనపై ఇటీవల ప్రచురితమైన వార్తలు పూర్తిగా అవాస్తవమని, సంబంధిత అధికారుల వివరణ తీసుకోకుండా ఏకపక్ష కథనాలు ప్రచురించడం వల్ల పరువు ప్రతిష్ఠలకు తీవ్ర నష్టం జరుగుతోందని వేలేరు తహసీల్దార్ కోమి అన్నారు. అవసరమైతే పరువునష్టం దావా కూడా వేస్తానని హెచ్చరించారు.గురువారం కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆమె, ఒక వ్యక్తి చేసిన ఆరోపణల ఆధారంగా వార్తలు ప్రచురించడం సరికాదన్నారు. ప్రజలు మీడియాలో వచ్చిన కథనాలను నిజమని నమ్మే అవకాశం ఉన్నందున, వాస్తవాలను పూర్తిగా నిర్ధారించిన తర్వాతే వార్తలు ప్రచురించాలని సూచించారు.కృష్ణవేణి అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో మొదట మిస్సింగ్ కేసు, అనంతరం కిడ్నాప్ కేసు నమోదైందని తెలిపారు.అనంతరం సంబంధిత అధికారులు, అదనపు కలెక్టర్‌ను కలిసి రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని వినతిపత్రం సమర్పించారని చెప్పారు.ఈ వ్యవహారం న్యాయపరమైన అంశాలతో ముడిపడి ఉండటంతో అధికారులు నిబంధనల ప్రకారమే వ్యవహరించారని, నిజమైన పట్టాదారుల పనులను ఎప్పుడూ నిలిపివేయలేదని స్పష్టం చేశారు.ప్రస్తుతం రెవెన్యూ శాఖపై ఎస్ఐఆర్, భూభారతి, సాదా బైనామా దరఖాస్తులు, రీ–సర్వే వంటి కార్యక్రమాలతో భారీ పనిభారం ఉందని తెలిపారు. ఇలాంటి సమయంలో అవాస్తవ కథనాలు ప్రచురించడం వల్ల అధికారులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇదే అంశంపై గతంలో ఒక మీడియా సంస్థ వివరణ తీసుకెళ్లినప్పటికీ, నెల రోజుల తర్వాత మళ్లీ అదే వార్త ప్రచురించడం వెనుక ఉద్దేశం ఏమిటో అర్థం కావడం లేదన్నారు.అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుని పరువునష్టం కేసు కూడా దాఖలు చేస్తామని హెచ్చరించారు.మండలానికి సంబంధించిన ఏ వార్తనైనా ప్రచురించే ముందు సంబంధిత అధికారుల వివరణ తీసుకుని, వాస్తవాలను పూర్తిగా ధృవీకరించాలని మీడియా సంస్థలకు తహసీల్దార్ కోమి విజ్ఞప్తి చేశారు. ఒకసారి ప్రతిష్ఠ దెబ్బతింటే దాన్ని తిరిగి పొందడం చాలా కష్టమని ఆమె వ్యాఖ్యానించారు.

# తల్లిపాలే శిశువుకు శ్రీరామరక్ష

## అవగాహన సదస్సులో సూపర్వైజర్ సరోజ,డిసిపిఒ కొమురయ్య



**బిఎన్ఎస్ న్యూస్ భూపాలపల్లి రేగొండ**

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా రేగొండ (3వ సెంటర్), పెద్దంపల్లి అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్వైజర్ సరోజ,జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాజ కొమురయ్య ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.పుట్టిన గంటలోనే శిశువుకు తల్లిపాలు పట్టించాలని,మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి,సంపూర్ణ ఆరోగ్యం లభిస్తాయని సూపర్వైజర్ సరోజ తెలిపారు.తల్లిపాలు శిశువుల శారీరక,మానసిక ఎదుగుదలకు,తల్లి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని డిసిపిఒ రాజ కొమురయ్య పేర్కొన్నారు.బాల్యవివాహాలు,బాలకార్మిక వ్యవస్థ,వేధింపులను అరికట్టేందుకు సమాజం అప్రమత్తంగా ఉండాలని,పిల్లలకు ఎలాంటి అత్యవసర పరిస్థితి వచ్చినా 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అవుట్‌రీచ్ వర్కర్ సోషల్ కుమార్,అంగన్‌వాడీ టీచర్లు బి.విమలాదేవి,పుష్పలత,ఆశా కార్యకర్తలు,గర్భిణులు,బాలింతలు పాల్గొన్నారు.



# హిరోషిమా దినోత్సవం సందర్భంగా ధర్మసాగర్ లో శాంతి సెమినార్



**బిఎన్ఎస్ న్యూస్ ధర్మసాగర్ ఆగస్టు 06**

హిరోషిమా దినోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మసాగర్ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా కమిటీ సహకారంతో గురువారం శాంతి సెమినార్ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.బి. ధర్మప్రకాశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.సెమినార్‌కు ముందు ఎం. రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ శాంతి, అణ్వాయుధాల నిర్మూలన అవసరాన్ని తెలియజేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రధానోపాధ్యాయులు కె.బి. ధర్మప్రకాశ్ మాట్లాడుతూ యుద్ధాలు, ముఖ్యంగా అణ్వాయుధాలు మానవాళికి తీవ్ర వినాశనాన్ని మిగులుస్తాయని అన్నారు. శాస్త్ర విజ్ఞానం మానవ సంక్షేమం, అభివృద్ధి కోసం ఉపయోగపడాలే గానీ విధ్వంసానికి కాదని పేర్కొన్నారు. ప్రపంచ శాంతి, అణ్వాయుధ నిరాయుధీకరణ, శాస్త్రీయ దృక్పథం నేటి సమాజానికి అత్యంత అవసరమని వివరించారు.ఈ సందర్భంగా విద్యార్థులు హిరోషిమా దినోత్సవ ప్రాముఖ్యత, ప్రపంచ శాంతి, శాస్త్రీయ పరిశోధనల ద్వారా స్వావలంబన సాధనపై ప్రసంగించారు.ఉపాధ్యాయులు పద్మజ, కిరణ్మయి మానవతా విలువలు, శాంతి పరిరక్షణ అవసరంపై మాట్లాడారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ప్రపంచ శాంతి ప్రతిజ్ఞ చేశారు.

# అయ్యగారిపేటలో తల్లిపాల వారోత్సవాలు"



సత్తుపల్లి, ఆగస్టు06 (బిఎన్ఎస్) న్యూస్: గురువారం సత్తుపల్లి పట్టణంలోని అయ్యగారిపేట సెక్టార్ సూపర్ వైజర్ యు మహాలక్ష్మి ఆధ్వర్యంలో రెండో అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులతో ప్రదర్శన చేశారు.అన్నప్రాసన వేడుకలు నిర్వహించారు. చిన్నారుల బరువులు, ఎత్తులు చూసి పౌష్టికాహార లోపాలు లేవని మహాలక్ష్మి నిర్ధారించారు.బిడ్డ జన్మించిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని 06 నెలల వరకు తల్లిపాలు ఇవ్వడం మంచిదని సూచించారు.ఈ కార్యక్రమంలో: అంగన్వాడీ టీచర్ పూచి జ్యోతి,లబ్ధిదారులు, చిన్నారులు పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు"




సత్తుపల్లి ఆగస్టు06 (బిఎన్ఎస్) న్యూస్: సత్తుపల్లి మండల పరిధిలోని గంగారం గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక వైద్య కేంద్రం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా గురువారం జరిగాయి.బిడ్డ జన్మించిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని సూచించారు.వ్యక్తిగత శుభ్రత పాటించడం ముఖ్యమని డాక్టర్(మెడికల్ ఆఫీసర్) ఆర్.అవినాష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో: హెల్త్ సూపర్ వైజర్ ఎల్. కె.విజయకుమారి, బి.శా రారాణి, ఏ ఎన్ ఎం లు ఆర్.రమాదేవి, కె.లక్ష్మి,ఆశాలు రాధ,చంద్రకళ,సువర్ణ, శిరీష,లబ్ధిదారులు పాల్గొన్నారు.